ఆంధ్రజ్యోతి
3
ANDHRAJYOTHY
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 21 మే 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 35.0 | కనిష్ఠం : 26.0



కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి

వనపర్తి రూరల్, మే 20: కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన వనపర్తి మండలం కిష్టగిరి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల ప్రకారం.. కిష్టగిరి గ్రామానికి చెందిన గొల్ల నక్క మూసన్న 25 గొర్రె పిల్లలను గ్రామ శివారులో ఉంచి, చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు. అనంతరం గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చాక గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందినట్లు తెలుసుకొని బోరున విలపించాడు. వాటి విలువ రూ.1,50,000 వరకు ఉంటుందని తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

రియల్ భూమ్ వచ్చేనా?


వనపర్తి శివారులోని ఒక రియల్ ఎస్టేట్ వెంచర్(ఫైల్)

- కరోనా నుంచి ఉమ్మడి జిల్లాలో పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- రెండు సార్లు మార్కెట్ విలువ పెంచడంతో కొనుగోలుదారుల వెనుకంజ
- ఎల్ఆర్ఎస్, జీపీ లేఅవుట్ల ఎత్తివేత, డీటీసీపీతోనూ రిజిస్ట్రేషన్లు తగ్గుదల
- ఎల్ఆర్ఎస్ ప్రకియ పూర్తయితే.. వ్యాపారం పెరుగుతుందనే ఆశలు
- ప్రభుత్వం మార్కెట్ విలువ మళ్లీ పెంచితే రాబడి పెరిగినా.. అమ్మకాలు అంతంతే ఉండే అవకాశం

మహబూబ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తయి.. భూములకు మళ్లీ డిమాండ్ వస్తుందని రియల్టర్లు, మధ్య తరగతి ప్రజలు ఆశిస్తుండగా.. గతంలోనే రెండుసార్లు భూముల మార్కెట్ విలువ పెంచిన ప్రభుత్వం.. తాజాగా మళ్లీ పెంచుతామని సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో అసలు రియల్ భూమ్ వస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ రహదారి ఉండటం, పట్టణాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగేది. కొన్ని ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం తెలియకముందే.. కంతుల వారీగా ప్లాట్లను కొనుగోలు చేయడం ఇక్కడే ప్రారంభించారు. ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్న కారణంగా ఎక్కువ మంది ఈ వ్యాపారంపై దృష్టి సారించారు. 2019 సంవత్సరం వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగానే సాగింది. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ లే అవుట్ల రెగ్యులరైజేషన్ కోసం ఎల్ఆర్ఎస్‌ను ప్రకటించిన తర్వాత కొనుగోళ్లు, అమ్మకాల్లో తగ్గుదల ప్రారంభమైంది. అలాగే ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడంలో భాగంగా జీపీ లే అవుట్లను రద్దు చేసి.. కేవలం డీటీసీపీ లే అవుట్లకు మాత్రమే అనుమతి ఇవ్వడం కూడా వ్యాపారం తగ్గుదలకు కారణమైంది. ఆ తర్వాత కరోనా మహమ్మారి వల్ల ప్రజలంతా ఆస్పత్రుల వెంట పరుగులు పెట్టడం, లాక్‌డౌన్ తదితర చర్యల వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారంపై కోలుకోలేని దెబ్బ పడినట్లయ్యింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మారాక.. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగిరం చేస్తామని ఆదేశాలు ఇవ్వడంతో రియల్టర్లు, మధ్య తరగతి పెట్టుబడిదారులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియా నిలిచిపోయింది. తాజాగా ప్రభుత్వం భూముల మార్కెట్ విలువను పెంచుతామని ప్రకటించింది. దాంతో అసలు రియల్ భూమ్ పరిస్థితి అటుంచితే.. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగితే మరింత నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు.

రిజిస్ట్రార్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో 2019 నుంచి రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లు, ఆదాయం వివరాలు

సంవత్సరం	డాక్యుమెంట్ల సంఖ్య	రాబడి (రూ.కోట్లల్లో)
2019	185930	173.57
2020	111361	101.36
2021	110767	187.80
2022	108142	252.72
2023	100113	253.30
2024(ఏప్రిల్)	32069	68.09

నాలుగేళ్లుగా నరకయాతన..

రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో వ్యాపారులు.. కొత్తగా వెంచర్లు వేయడం, అడ్వాన్సులు ఇచ్చుకోవడం, ఎలాగూ వ్యాపారం బాగానే ఉంటుందనే ఆశతో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవడం, మధ్య తరగతి ప్రజలను కొంత శాతానికి స్లీపింగ్ పార్టనర్లుగా పెట్టుకోవడం తదితర పనులన్నీ చేశారు. ఉన్నట్టుండి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి డిమాండ్ పడిపోవడంతో.. అడ్వాన్సులు తీసుకున్న రైతులు అటు రిజిస్ట్రేషన్లు చేయకపోవడం.. ఇటు ఆ డబ్బులు తిరిగి రాకపోవడం, స్లీపింగ్ పార్టనర్లుగా ఉన్న వారి నుంచి, అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు రావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వ్యాపారులు ఏకంగా ఐపీ(ఇన్‌సాల్వెన్సీ పిటిషన్) పెట్టడం వంటివి చేశారు. మరికొందరు ఉన్న ఊళ్లు వదిలి.. హైదరాబాద్ వంటి ప్రాంతాలకు పోయారు. ఇంకొందరు చెక్‌బౌన్స్‌లు, కేసులంటూ తిరుగుతున్నారు. పేరుకు భూములున్నా.. నగదు లేక సతమతమవుతున్నారు. కరోనా వల్ల నిర్మాణ రంగం ఎక్కువగా ఊపందుకోవడంతో ప్లాట్లపై పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య తగ్గింది. అలాగే ఒకరి నుంచి ఒకరికి అగ్రిమెంట్లపై ప్లాట్ల బదలాయింపు చేసుకుంటూ ధరలను దళారులు పెంచుకుంటూ పోవడంతో అవి సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. 2020 వరకు ఒక గుంట ప్లాటును కొనుగోలు చేయాలంటే అప్పటి మార్కెట్ విలువ ప్రకారం రిజిస్ట్రేషన్‌కు రూ.10 వేల వరకు ఖర్చు అయ్యేది. కానీ 2021లో రెండుసార్లు మార్కెట్ వాల్యూ పెంచిన తర్వాత.. ఇప్పుడు దాదాపు రూ.50 వేల వరకు ఖర్చు వస్తోంది. మరోసారి మార్కెట్ వాల్యూ పెరిగితే.. ఇక స్థలం తీసుకుని, ఇంటిని నిర్మించుకునేవారి సంఖ్య తగ్గిపోయి.. అపార్ట్‌మెంట్ సంస్కృతి పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వస్తోంది. ఇప్పటికే సామాన్యులకు అందనంత ఎత్తులో ప్లాట్ల ధరలు ఉన్నాయి. అయితే మార్కెట్ విలువ పెంచి.. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచకపోతే రియల్ భూమ్ కొంత వచ్చే పరిస్థితి ఉంటుందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.


వనపర్తిలోని ఓ వెంచర్

రూ.70 వేలకు పైగా తగ్గిన డాక్యుమెంట్లు..

ఉమ్మడి పాలమూరు జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో 2019 వరకు మొత్తం 16 ఎస్ఆర్‌వో(సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్)లు ఉండేవి. ఆ తర్వాత దేవరకద్ర, అయిజ, పెబ్బేరు, బిజినేపల్లి ఎస్ఆర్‌వోలు తీసివేసిన తర్వాత 2020 నుంచి 12 ఎస్ఆర్‌వోల పరిధిలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. 2019లో మహబూబ్‌నగర్ రిజిస్ట్రార్ పరిధిలో 1.85 లక్షల డ్యాకుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా.. 2020లో కరోనా ప్రభావం ప్రారంభం కావడంతో 74,569 డాక్యుమెంట్లు తగ్గి.. కేవలం 1.11 లక్షల డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఆ తర్వాత 2021 సంవత్సరానికి వచ్చేసరికి మరో 594 డాక్యుమెంట్లు తగ్గిపోయి.. 1.10 లక్షల రిజిస్ట్రేషన్లు మాత్రమే చేశారు. 2022లో కరోనా ప్రభావం ముగిసినప్పటికీ.. వ్యాపారం ఇంకా పెరగకపోవడం, నిర్మాణ రంగంవైపు ప్రజలు దృష్టి సారించడంతో 2019 కంటే మరో 2,625 డాక్యుమెంట్లు తగ్గిపోయి.. 1.08 లక్షల డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. 2023 సంవత్సరంలోనైనా పెరుగుతాయని రియల్టర్లు భావిస్తున్న తరుణంలో.. మరో 8,029 డాక్యుమెంట్లు తగ్గాయి. దాంతో గత సంవత్సరం కేవలం 1,00,113 డాక్యుమెంట్లే రిజిస్టర్ అయ్యాయి. తాజాగా ప్రభుత్వం మారడం, ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పడంతో కొంత ఉపశమనం వచ్చి.. గడిచిన ఏప్రిల్ వరకే దాదాపు 32 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఇదే ఊపు కొనసాగి.. ఎల్ఆర్ఎస్ పూర్తయితే రిజిస్ట్రేషన్లు పెరిగేవి. కానీ భూముల మార్కెట్ విలువ పెంచుతామని ప్రభుత్వం ప్రకటించడంతో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. మార్కెట్ విలువ పెంచి.. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే ప్రభుత్వానికి రాబడి పెరిగినా.. కొనుగోళ్లు, అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉంటాయని చెప్పొచ్చు.

అర్హుల తగ్గుదల


ఇటిక్యాలలో ట్రాక్టర్ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతులు(ఫైల్)

- కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏటా తగ్గుతున్న రైతులు
- ప్రారంభంలో 96,888 మంది అర్హులు
- 16వ విడతకు వచ్చే సరికి 46,842 మందికే పరిమితం
- రైతులు మరణించడం, ఆధార్ సీడింగ్, ఈకేవైసీ చేసుకోకపోవడం కారణాలు

గద్వాల, మే 20: కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద ఏటా అర్హులు తగ్గిపోతున్నారు. ఈ పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2019, ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఏడాదికి మూడు దఫాలుగా రూ.2,000 చొప్పున రైతుల ఖాతాలో జమచేస్తున్నారు. దీంతో రైతులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతు బంధు సాయం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధి యోజన డబ్బులను సాగు కోసం పెట్టుబడిగా వాడుకుంటున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతులు ఏటా తగ్గుతున్నారు. 2019 ప్రారంభంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ పథకం కింద 96,888 మంది రైతులు లబ్ధిపొందగా ఈ ఏడాది 16వ విడత వచ్చే సరికి 46,683 మందికే పరిమితం అయ్యారు. అంటే దాదాపు 50 వేల మంది రైతులు తగ్గిపోయారు.

కొత్తవారికి అవకాశం ఇవ్వకపోవడంతో..

కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద కొత్త పాసు పుస్తకం పొందిన రైతులను అర్హులుగా గుర్తించారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అవకాశం ఇచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 1.90 లక్షలకు పైగా రైతులు ఉన్నా, 96,888 మంది మాత్రమే అర్హత సాధించారు. ఐదో విడత డబ్బులు ఇచ్చే సరికి 92 వేల మందికే పరిమితం అయ్యారు. 16వ విడత వచ్చే సరికి 46,842 మంది రైతులే అర్హులుగా ఉన్నారు. దాదాపు 50 వేల మంది రైతులు తగ్గిపోయారు. దీనికి కారణం కొందరు రైతులు మరణించడం, భూ విక్రయాలు జరగడం, భాగ పరిష్కారాలు జరగడం, పట్టాకలిగిన వారు ఉద్యోగం సాధించడం, మరికొందరు ఆదాయ పన్ను పరిధిలోకి రావడంతో అనర్హులుగా చేర్చి, తగ్గించారు. దీంతో దాదాపు రూ.12 కోట్లు రైతులకు దక్కాల్సిన సొమ్ము ప్రభుత్వానికి ఆదా అవుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా 2019 నుంచి కొత్తవారు పథకంలో చేరడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. దాంతో చాలా మంది అర్హులుగా ఉన్నా పథకం కింద ప్రయోజనం పొందలేకపోతున్నారు.

అవగాహన లేకపోవడమూ కారణం

అర్హులైన పలువురు రైతులు అవగాహన లేక కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంలో లబ్ధి పొందడం లేదు. ఈ పథకం కోసం ఈకేవైసీ ఎలా చేసుకోవాలో తెలియక చాలా మంది రైతులు దానికి దూరంగా ఉన్నారు. అదేవిధంగా బ్యాంకు ఖాతాకు ఆధార్ నంబర్ సీడింగ్ లేకపోవడం, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు వివరాలు లింక్ చేయకపోవడం, ల్యాండ్ సీడింగ్(ధరణికి) లేకపోవడం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాల్లో పేరు సరిపోకపోవడం వంటి కారణాలతో కూడా చాలా మంది లబ్ధి పొందడం లేదు.

కొత్తవారికి అవకాశం ఇవ్వాలి..

కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంలో చేరడానికి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు దాదాపు 20వేల మందికి పైగా రైతులు కొత్తపాసు పుస్తకాలు పొందారు. అందులో కొనుగోలుతో పాటు, మరణించిన రైతు కుటుంబ సభ్యులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు పథకానికి ఏటా అవకాశం ఇచ్చినట్లే.. కేంద్ర ప్రభుత్వం కూడా కొత్తవారికి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

అర్హులందరికీ అందుతోంది

కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తవారికి అవకాశం ఇస్తే దరఖాస్తులు తీసుకుంటాము. అది ప్రభుత్వ నిర్ణయం మీద ఆధారపడి ఉంది. రైతులు మరణించడం, భూ విక్రయాలు జరగడం, ఆధార్ సీడింగ్, ఈకేవైసీ చేసుకోకపోవడం వల్లనే పథకం కింద రైతులు తగ్గారు. అర్హులందరికీ కిసాన్ సమ్మాన్ నిధి అందుతోంది.

\- గోవిందనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, గద్వాల


ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- సిర్సవాడలో ఘనంగా ఉత్సవాలు
- నేడు ఎదుర్కోళ్లు

తాడూరు, మే 20: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభయ్యాయి. మొదటిరోజు తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకం నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతంతో పాటు ధ్వజారోహణం, పుట్టమట్టి సేకరణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజ అనంతరం విశ్వశాంతి మహాగీతాయజ్ఞం నిర్వహించడంతో పాటు భక్తులందరికీ అన్నప్రసాదాలను అందించనున్నారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు జగదీశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


పుట్ట మట్టిని తేవడానికి వెళ్తున్న భక్తులు


ఉండవెల్లి మండలం బొంకూరు గ్రామంలో రచ్చకట్ట వద్ద కూలిన వేప చెట్టు


అచ్చంపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

వర్ష బీభత్సం

- పిడుగుపాటుకు నాలుగు గొర్రెలు మృతి
- జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దకొత్తపల్లి/మన్ననూరు/అచ్చంపేట టౌన్/అలంపూర్ చౌరస్తా, మే 20: నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో సోమవారం వర్షం బీభత్సం సృష్టించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో పిడుగు పాటుకు నాలుగు గొర్రెలు మృతి చెందగా, రెండు జిల్లాల్లోనూ చెట్లు, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దాంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామ శివారులో నాగర్‌కర్నూల్ మండలం బొందలపల్లి గ్రామానికి చెందిన దండు వెంకటయ్య తన గొర్రెలను పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామ శివారుకు మేత కోసం తీసుకొచ్చాడు. సోమవారం సాయంత్రం వర్షం కురిసి పిడుగు పడటంతో జూగుండ్ల సమీపంలో ఉన్న నాలుగు గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ రూ.60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

స్తంభాలను పరిశీలించిన ఏఈ

అచ్చంపేట పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వానకు పట్టణంలోని రహదారులు జలమయం అయ్యాయి. ఐనోల్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. విరిగిన స్తంభాలను ఏఈ ఆంజనేయులు పరిశీలించారు. ఐదు స్తంభాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, మరమ్మతులు ప్రారంభించామని చెప్పారు.


మన్ననూరులో విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఏఈ రమేష్

కూలిన చెట్లు, విరిగిన స్తంభాలు

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు పలు గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు వరిగిపోయాయి. ఉండవల్లి మండల పరిధిలోని మెన్నిపాడు, కలుగొట్ల, పుల్లూరు, మానవపాడు మండలంలోని చెన్నిపాడు, పోతులపాడు, గోకులపాడు, మానవపాడు, అమరవాయితో పాటు పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో పలు గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. పలుచోట్ల ఇన్సులేటర్లు ఫెయిల్ అయ్యాయి. బొంకూరు గ్రామంలో ఏడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఇక శాంతినగర్ ఫీడర్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ లైనులో ఏడు చోట్ల ఇన్సులేటర్లు డ్యామేజీ అయ్యాయి. దీంతో కలుకుంట్ల ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే పలు గ్రామాలకు, అలంపూర్ చౌరస్తా ఫీడర్ నుంచి సరఫరా అయ్యే వివిధ గ్రామాలకు ఆదివారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. బొంకూరు పంచాయతీ కార్యాలయం ముందు విరిగిన చెట్టును తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గ్రామస్థులు అంటున్నారు.

ఆ గ్రామాలకు కరెంట్ కట్

నల్లమల అభయారణ్య ప్రాంతం మన్ననూరు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షంతో మన్ననూరు అటవీ శాఖ చెక్‌పోస్టు సమీపంలోని ఐదు విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. అచ్చంపేట నుంచి అమ్రాబాద్, పదర మండలాలకు విద్యుత్ సరఫరా అయ్యే లైన్ తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పర్ ప్లాట్‌లోని గ్రామాలన్నీ సోమవారం రాత్రి అంధకారంలో మగ్గాయి. విద్యుత్ ఏఈ రమేష్, లైన్‌మెన్‌లు శేఖర్ గౌడ్, శంకర్ గౌడ్, ఇతర సిబ్బంది కూలిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.


మానవపాడు మండలం పోతులపాడు గ్రామ స్టేజీ సమీపంలో తెగి పడిన విద్యుత్ తీగ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం/రేవల్లి, మే 20: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్పునూరు గ్రామానికి చెందిన పిట్టల బీసయ్య(56) భార్యా పిల్లలతో హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవలే నాగర్‌కర్నూల్ పట్టణంలో సొంత నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. అతని ఇంటి పక్కనే నివాసం ఉంటున్న నాగిరెడ్డి బీసయ్య నుంచి బోరు పైపులను తీసుకెళ్లాడు. సోమవారం పైపులను తిరిగి బీసయ్య ఇంటికి తెచ్చాడు. పైపులను ఇంటిపై పెడదామని బీసయ్య మిద్దెపైకి వెళ్లాడు. నాగిరెడ్డి కింద నుంచి పైపులు అందిస్తున్న క్రమంలో పైపులు పైనున్న విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై బీసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బీసయ్య భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

మృతదేహం లభ్యం

పెబ్బేరు, మే 20 : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని జూరాల కాల్వలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. శవాన్ని స్థానికులు గమనించి, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డికి తెలిపారు. ఎస్ఐ అక్కడకి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వ్యక్తి వయస్సు 55 ఉండొచ్చని చెప్పారు. అతను భిక్షాటన చేసేవాడని అనుమానం వ్యక్తం చేశారు. అతను తెలిసిన వారు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

రాజాపూర్, మే 20: రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలానగర్ మండలం తిర్మలగిరి గ్రామ శివారులో గల తోటలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామ పంచాయతీ లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన దేవేందర్ తన కుమారుడు నందు(20)తో కలిసి మామిడి పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం లీజుకు తీసుకున్న తోటలోని గదిలో గల ఇనుప పైపునకు నీళ్ల సరఫరా చేసే డ్రిప్ పైపుతో నందు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి మృతిపై తండ్రి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

వడ్డేపల్లి, మే 20: మునిసిపాలిటీ పరిధిలోని పైపాడులో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీ లు సోమవారం ముగిశాయి. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన శాంతి నగర్ జట్టుకు మాజీ జడ్పీటీసీ సభ్యుడు వడ్డేపల్లి శ్రీని వాసులు రూ.30,016 బహూకరించారు. రెండవ స్థానంలో నిలిచిన ప్యాపిలి జట్టుకు వడ్డేపల్లి యుగంధర్‌రెడ్డి రూ.20,016, మూడోస్థానంలో నిలిచిన పంచలింగాల జట్టుకు రూ.10,016 ఆర్.ప్రమీలమ్మ బహుమతిగా అందించారు. విజేతలను దాతలు, గ్రామపెద్దలు అభినందించారు.

జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా తగ్గిన ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టులో 3.709 టీఎంసీల నీటి నిల్వ

అమరచింత, మే 20: జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం జూరాల ప్రాజెక్టుకు 1,198 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరింది. దీంతో జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్, సమాంతర కాల్వల వద్దకు భారీగా నీరు చేరుతుంది. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ డ్యాం నుంచి 1.9 టీఎంసీల నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో పూర్తిగా ఒట్టిపోయిన కృష్ణానది నేలను వరద నీటితో తడుపుతూ ముందుకు సాగి భారీ స్థాయిలో జూరాల ప్రాజెక్టుకు నీరు చేరుతోంది. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 3.709 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వకన్నా రెట్టింపు నీరు అంటే 1,198 క్యూసెక్కుల నీరు అదనంగా ప్రాజెక్టులోకి చేరింది. నారాయణపూర్ డ్యాం నుంచి వరద నీరు స్వల్పంగా తగ్గింది. ఏదేమైనా ఈ ప్రాంతంలో ఏర్పడిన తాగునీటి ఇబ్బందుల నుంచి ఆయా గ్రామాల ప్రజలు గట్టెక్కినట్లు అయింది. మరో పది రోజుల పాటు వరద ఇలాగే కొనసాగితే చంద్రఘడ్ లిఫ్ట్ ద్వారా ఖరీఫ్ సాగు రైతులకు సాగునీరు వదిలే అవకాశం ఉంది. జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్ నుంచి వరద కొనసాగుతుందని ప్రాజెక్టు అధికారులు బీచుపల్లి ఆంజనేయులు తెలిపారు.


ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి చేరుతున్న వరద నీరు

బీడీ కార్మికులకు రూ. 250 కూలీ పెంచాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం

అమరచింత, మే 20: చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్న బీడీ కార్మికులకు యజమానులు తక్షణమే స్పందించి రూ.250 కూలీ పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం డిమాండ్ చేశారు. సోమవారం అమరచింత మార్క్స్ భవనంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా బీడీ కార్మికులు వేలాది మంది దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు కార్మికులకు హామీ ఇచ్చిన అవి నెరవేరడం లేదని విమర్శించారు. బీడీ కార్మికుల ఆసుపత్రి పీఎఫ్ లాంటి సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. కార్మికులకు రెండేళ్ల వేతన ఒప్పందం ప్రకారం కూలీ పెంచాలని ఫ్యాక్టరీ యజమానులతో నెల రోజులుగా ఇప్పటికే మూడు దఫాలు చర్చలు జరిపిన యజమానులు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా యజమానులు స్పందించి 1000 బీడీకి 250 రూపాయలు కూలీ పెంచాల్సిందే అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ దేవదానం, సామెల్, అరుణ్ కుమార్, కోళ్ల వెంకటన్న, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కొండన్న, కురుమన్న, చంద్రన్న, సీ రాజు, వెంకటేష్ గౌడ్, వరప్రసాద్, నీలమ్మ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులను అరెస్ట్ చేయాలి


ఎస్పీకి వినతిపత్రం అందజేసి మాట్లాడుతున్న నాయకులు

మహబూబ్‌నగర్, మే 20 : మద్యం దుకాణం వద్ద జరిగిన గొడవలో హత్యకు గురైన శ్రీకాంత్‌యాదవ్ కేసుల్లో పరారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు సోమవారం ఎస్పీ హర్షవర్ధన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కేసులో పోలీసులు పది మందిపై కేసు నమోదు చేసి అందులో ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వారిని అరెస్ట్ చేయాలని కోరారు. ఇందులో ఏ-10గా ఉన్న వ్యక్తి రఘుపతిరెడ్డి మునిసిపల్ ఉద్యోగి అని, ఇతను ఆంటిస్పెటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి శ్రీకాంత్‌పై దాడి చేసిన సీసీ ఫుటేజీలు ఉన్నాయని, దాడి చేసి మరణానికి కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని లేకపోతే మృతుడి తల్లి, కుటుంబసభ్యులతో కలిసి హెచ్‌ఆర్‌సీని ఆశ్రయిస్తామన్నారు. ఎస్పీని కలిసిన వారిలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు చందూయాదవ్, శ్రీనివాస్ ఉన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

అమ్రాబాద్, మే 20: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని కుమ్మరోనిపల్లి గ్రామానికి చెందిన పంచలింగాల బాల సాయిలు (72)వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ సోమవారం తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యం బారినపడి భార్యాభర్తల మధ్య వాగ్వాదం నెలకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ పరిస్థితుల్లో మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనైన బాల్ సాయిలు ఆదివారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగారని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అమ్రాబాద్, అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయినా పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందాడన్నారు. మృతుడి భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రమేష్ వెల్లడించారు.

అక్రమంగా పట్టా చేయించుకున్నారు

- కలెక్టర్ కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

గద్వాల న్యూటౌన్, మే 20 : తన తండ్రి పేరునున్న భూమిని తన అన్న నాగరాజు తన పేరుపై మార్చుకున్నారని అతడి సోదరి నీలావతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలం, పెద్ద దిన్నె గ్రామానికి చెందిన కాశపోగు లక్ష్మన్నకు సర్వే నెంబర్ 255/బీలో 4.10 ఎకరాలు, 273/ఏ2లో 15 గుంటల భూమి ఉంది. ఆయన 2020, జూన్ 23న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెల్లో నలుగురికి వివాహమైంది. చిన్న కుమార్తె నీలావతికి పెళ్లి కాలేదు. అయితే తండ్రి పేరుతో ఉన్న భూమిని అన్న నాగరాజు తనపేరున మార్పించుకున్నాడు. తనకు భాగం ఇవ్వకుండా, అక్రమంగా పేరు మార్పించుకోవడంపై ఆమె కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

ధన్వాడలో కల్లు అమ్మకాలు బంద్

ధన్వాడ, మే 20 : మండల కేంద్రమైన ధన్వాడలో రెండు రోజుల నుంచి కల్లు అమ్మకాలు బంద్ కావడంతో కల్లు ప్రియులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం ఎక్సైజ్ అధికారులు కల్లు అమ్మకాలను నిలిపివేయడంతో కల్లు దుకాణాలు మూత పడగా, చేసేది లేక కల్లు ప్రియులు పక్క గ్రామాలకు పరుగులు తీస్తున్నారు. ఇక్కడ కల్లు అ మ్మకాలు కొనసాగుతున్న సమయంలోనే కొంత మంది పక్క గ్రామాల నుంచి అక్రమంగా కల్లు అమ్మకాలు జరిపేవారు. ఇప్పుడు ఇక్కడ పూర్తిగా కల్లు దుకాణాలు నిలిపి వేయడంతో అక్రమ కల్లు అమ్మకాలు మరింత జోరందుకున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

కేఎల్ఐ ప్రధాన కాల్వలో నీళ్లు పారేనా?

- కాల్వల్లో ఏపుగా పెరిగిన చెట్లు, కంప పొదలు
- వర్షాకాలం వరకు తొలగిస్తారా?

కల్వకుర్తి, మే 20 : ఎంజీ కేఎల్ఐ ప్రధాన కాల్వలో పెద్ద చెట్లు, ముళ్ల పొదలతో నిండుకుంది. వర్షాకాలం సమీపిస్తుండడంతో కేఎల్ఐ కాల్వలో చెట్లను, ముళ్ల పొదలను తొలగించకపోతే నీరు పారేందుకు తీవ్ర ఆటంకంగా మారి కాల్వ దెబ్బతినే ప్రమాదం ఉంది. కేఎల్ఐ ప్యాకేజీ నెంబరు 29 కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు 160.5కిలోమీటర్ల కాల్వ వరకు పలు చోట్ల కంపచెట్లే దర్శనమిస్తున్నాయి. ప్రధాన కాల్వకు అధికారులు నీళ్ల వదిలినప్పుడు గతంలోనే ఊర్కొండ, కల్వకుర్తి మండలాల పరిధిలోని పలు చోట్ల ప్రధాన కాల్వ తెగిపోయి పంటలకు తీరని నష్టం జరిగింది. ఊర్కొండ మండలంలోని మాదారం, కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద, తర్నికల్, ఎల్లికల్ తండా, సిలార్‌పల్లి, తిమ్మరాసిపల్లి, జంగారెడ్డిపల్లి గ్రామాల సమీపాల్లోని ప్రధాన కాల్వలో చెట్లు దట్టంగా పెరిగాయి. కాల్వలోని చెట్లను, ముళ్ల పొదలను తొలగించడంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పట్టనట్లుగా వ్యవహరించడం వల్లే చెట్లు ఏపుగా పెరిగాయని ఆయా గ్రామాల రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి తీసిన ప్రధాన కాల్వల నిర్వహణ సక్రమంగా లేకపోవడం పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు కొన్నిచోట్ల కంట్రోలింగ్ పాయింట్ కూడా లేకపోవడంతో లక్ష్యం నీరుగారుతున్నది. వర్షాలు సమృద్ధిగా పడి సకాలంలో నీళ్లు వదలాల్సి వస్తే కాల్వలోని చెట్లు, ముళ్ల పొదలు అడ్డంకిగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


కేఎల్ఐ ప్రధాన కాల్వలో ఏపుగా పెరిగిన చెట్లు


పేరుకుపోయిన ముళ్ల పొదలు

● యుద్ధ ప్రాతిపదికన చెట్లు తొలగించాలి

కేఎల్ఐ ప్రధాన కాల్వలో దట్టంగా పెరిగిన చెట్లను, ముళ్ల పొదలను అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి. లేకపోతే కాల్వలో నీరు పారడం కష్టమే. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలి.
- రైతు గోవర్ధన్‌రెడ్డి



● చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం

కేఎల్ఐ ప్రధాన కాల్వలో పెరిగిన చెట్లు సంబంధిత కాంట్రాక్టరే తొలగించాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చి చెట్లు తొలగించేలా చూస్తాం.
- ఈఈ శ్రీకాంత్

ఓటరు జాబితాను సరిచేయాలి

- బతికున్న మహిళను మృతి చెందినట్లుగా డిలీట్
- ఎన్నికల సంఘానికి గ్రామస్థుడి ఫిర్యాదు


ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి పర్సనల్ సెక్రటరీ జాకీర్ షేక్ కు ఫిర్యాదు అందజేస్తున్న నరేందర్ గౌడ్

ఊర్కొండ, మే 20: బతికున్న మహిళను చనిపోయినట్లుగా ధ్రువీకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటూ ఓటరు జాబితాను సరిచేయాలని మండలంలోని మాదారం గ్రామానికి చెందిన నరేందర్ గౌడ్ సోమవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాడు. మండలంలోని మాధారం గ్రామంలో నాలుగు పోలింగ్ స్టేషన్‌లు 239, 240, 241, 242లో ఉన్నాయన్నారు. 242 పోలింగ్ బూత్‌లో వరుస సంఖ్య 449 ఓటరు ఐడి నంబరు డబ్ల్యూఎల్‌యూ 0522060 శ్రీలత అనే మహిళ ఓటురును జాబితాలో మృతి చెందినట్లుగా ధ్రువీకరిస్తూ డిలీట్ చేశారని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె ఓటు హక్కును కోల్పోయేవిధంగా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన లిఖిత పూర్వకంగా ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మృతి చెందిన వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాలో నమోదు కావడం జరిగిందని, అధికారుల నిర్లక్ష్యం ఉందని ఆయన ఫిర్యాదులో తెలియజేశారు.

లారీ డ్రైవర్‌పై దాడి..


చికిత్స పొందుతున్న డ్రైవర్ మురుగన్

కొత్తకోట, మే 20 : మండలంలోని జాతీయ రహదారి కడుకుంట్ల స్టేజి దగ్గర నిలిపి ఉన్న లారీ డ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం హైదారాబాద్‌లో ఫర్నిచర్ లోడ్‌తో బెంగుళూరుకు బయలుదేరిన లారీని మధ్యరాత్రి కడుకుంట్ల స్టేజి వద్ద డ్రైవర్ బహిర్భూమికి వెళ్ల డానికి నిలిపాడు. తిరిగి లారీ వద్దకు వచ్చే సరికి ముగ్గురు వ్యక్తులు రాయి, ఇనుప సీకులతో దాడి చేసి పరారయ్యారు. సమాచారం తెలిసిన పోలీసులు గాయాలతో ఉన్న డ్రైవర్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 20: భారత యువజన క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని లక్ష్మీబాయి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్వాలియర్‌లో పీజీ ,డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకై దరఖాస్తు కోరుతున్నట్లు తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి క్రీడా శిక్షకులుగా ఎంపిక అయ్యే అవకాశం లభిస్తుందన్నారు. సీనియర్ క్రీడాకారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జూన్ 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫీజు, అర్హతలు తదితర వివరాలను వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. జూన్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఫీజు 31లోగా చెల్లించాలి

వనపర్తి రూరల్, మే 20: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు 4వ సెమిస్టర్, 6వ సెమిస్టర్ పరీక్షల ఫీజులు ఈనెల 31వ తేదీలోగా చెల్లించాలని, మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు తేదీని రూ.1000 ఆలస్య రుసుముతో ఈ నెల 22వ తేదీ వరకు పొడిగించారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులు తమ సెమిస్టర్ పరీక్షల ఫీజును నిర్ణీత తేదీలోగా చెల్లిం చాలని కోరారు.

కొనసాగుతున్న మదనగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

పెంట్లవెల్లి, మే 20 : మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో వెలసిన పురాతనమైన మదనగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం మొదటగా గణపతి పూజ, మహామంగళహారతి, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అదేవిధంగా బుధవారం అంకురార్పణం, నృసింహ జయంతి, అదేవిధంగా గురువారం సాయంత్రం 6గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ రథోత్సవానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు. వచ్చే భక్తులనుద్దేశించి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రాజాపూర్, మే 20 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామ జాతీయ రహదారి-44పై సోమవారం సాయంత్రం అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో కానిస్టేబుల్ సుదర్శన్, పోలీసులు పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాహనంతో పాటు, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బెల్టు షాపులను తొలగించాలని ఫిర్యాదు చేస్తే బెదిరిస్తున్నారు..

- ఏఎస్పీకి ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం, మే 20 : ఇళ్ల మధ్యలో బెల్టుషాపులు ఇబ్బందికరంగా మారిందని పోలీసులకు ఫిర్యాదు చేస్తే తనను బెదిరిస్తున్నారని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.విద్యాసాగర్ సోమవారం ఏఎస్పీ రామేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో ఐఎంబీ చర్చి, ఐఎంబీ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న కొందరు కాలనీవాసులు తమ ఇళ్ల ముందు కాఫీ షాపు పేరుతో బెల్టుషాపులు నిర్వహిస్తుండగా తరచూ గొడవలు జరిగి ఆ ప్రాంతంలో ఆకతాయిలు హంగామా చేస్తున్నారని గత కొద్ది రోజుల క్రితం 100కు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో తనపై కోపంతో ఊగిపోతూ జిల్లా కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి తనకు ఫోన్‌చేసి బెదిరిస్తున్నారని ఆ వ్యక్తి పేరు వివరాలు, ఫోన్ నెంబర్లతో సహా జిల్లా అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్, నలుగురిపై కేసు

గద్వాల క్రైం, మే 20 :ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురు యువకులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లపై జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన అనిల్‌కుమార్, ఈశ్వర్, వడ్డేపల్లి మండలానికి చెందిన రాకేష్, నాగరాజు అనే యువకులు జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీలో బెట్టింగ్ ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లి, మే 20 : జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని చాగాపురం గ్రామానికి చెందిన మోహన్ (24) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మోహన్ గత ఆదివారం బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాల వనరుల అధ్యయనానికి కేంద్ర బృందం పర్యటన

నాగర్‌కర్నూల్ టౌన్, మే 20: గ్రామాల్లో వనరులపై కేంద్ర పరిశోధన బృందం పర్యటనకు సంబంధిత శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 24 వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటించనున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పని చేసే అసిస్టెంట్ సెక్షన్ అధికారులు ఎంపిక చేసిన నాలుగు మండలాల పరిధిలోని ఐదు గ్రామాలను సందర్శించి గ్రామీ ణ ఆర్థిక, సామాజిక స్థితిగతులను, కేంద్ర ప్ర భుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాల పై అధ్యయనం చేయనున్నారని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ మండలం చందుబట్ల, గన్యాగుల, అల్లాపూర్ గ్రామాలతో పాటు బిజినేపల్లి, తెలకపల్లి గ్రామాలను కేంద్ర బృందం పర్యటించనున్నారన్నారు. డీఆర్‌డీఏ పీడీ చిన్నఓబులేష్, డీపీవో కృష్ణ, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

● తెలకపల్లి : మండలానికి స్టడీ టూర్ నిమిత్తం ఆరుగురు ట్రైనీ ఐఏఎస్‌ల బృందం గ్రామ పంచాయతీ తెలకపల్లికి సోమవారం చేరుకున్నారు. వారు సోమవారం నుంచి 24వ తేదీ వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయుచున్న పథకాలు, అభివృద్ధి పనులు మొదలైన అంశాలపై క్షేత్ర పరిశీలన చేస్తారని ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. వారికి కావాల్సిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవడానికి ఇదివరకే సూచనలు చేయడం జరిగింది.

మైసమ్మ అడవిలో సీసీ కెమెరా మాయం

నవాబ్‌పేట, మే 20 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పర్వతాపూర్ మైసమ్మ అటవీ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఏర్పాటు చేసిన సీసీ కెమెరా మాయమైంది. మహబూబ్‌నగర్, నవాబ్‌పేట మండలాల సరిహద్దు మధ్యలో ఉన్న మైసమ్మ అటవీ ప్రాంతంలో అమ్మవారు ఉండటంతో నిత్యం ఇక్కడకు భక్తులు వచ్చిపోవడంతో పాటు, షాద్‌నగర్, పర్గి, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే భద్రత కోసం గతంలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అడవిలో హత్యలు జరగడంతో గోల్ బంగ్లాకు వెళ్లే దారిలో అటవీ అధికారులు ఇటీవల సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు.

కానీ గత మూడు రోజులుగా ఈ కెమెరా కన్పించడం లేదు. ఈ కెమెరాను ఎవరైనా అపహరించారా, లేదా కోతులు మాయం చేశాయా అని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదే విషయంపై అటవీ అధికారి సుకన్యను వివరణ కోరగా పదిరోజుల క్రితం కెమెరా మాయమైందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



సీసీ కెమెరా లేని సోలార్ స్తంభ ం

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

- జిల్లా ఆహార భద్రత అధికారి మనోజ్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 20: కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఆహార భద్రత అధికారి మనోజ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, సూపర్ మార్కెట్లు, మామిడి పండ్ల విక్రయాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రముఖ హోటల్‌ను ఆయన తనిఖీ చేసి ఆహార పదార్థాల తయారీ, నాణ్యతను పరిశీలించారు. అలాగే ఓ సూపర్ మార్కెట్‌ను సందర్శించి ఆహార పదార్థాల ప్యాకింగ్, వాడుక చివరి గడువును పరిశీలించారు. తదనంతరం బస్టాండు ఎదురుగా రామాలయం కమాన్ వద్ద అమ్మకానికి ఉంచిన మామిడి పండ్లను పరిశీలించి మాగ పెట్టేందుకు కార్బైడ్ వంటి హానికర పదార్థాలు వాడుతున్నారా వంటి వివరాలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కొన్ని హోటల్స్, సూపర్ మార్కెట్లలోని ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. కల్తీ జరిగినట్లు నిర్ధారణ అయితే వాటిపై అదనపు కలెక్టర్‌కు రిపోర్టు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వ్యాపారులు ఆహార పదార్థాలు, పండ్లు అమ్మకాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు.


ఓ సూపర్ మార్కెట్‌లో ప్యాకింగ్ ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా ఆహార భద్రత అధికారి మనోజ్‌కుమార్

పోలీసుల తీరు అభినందనీయం

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ - బ్యాచ్‌మేట్‌కు రూ.1.20 లక్షల ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్, మే 20 : తమతో పాటు పనిచేసిన పోలీస్ ఉద్యోగి అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా బ్యాచ్‌మేట్‌లు అంతా కలిసి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. బీచుపల్లి 10వ బెటాలియన్ 1995 బ్యాచ్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు రెండేళ్ల క్రితం పెరాలసిస్ కారణంగా అనారోగ్యానికి గురయ్యారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు బ్యాచ్‌మేట్‌లు అంతా కలిసి రూ.1.20 లక్షలు జమ చేశారు. సోమవారం జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ చేతుల మీదుగా శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు చెక్ అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ సొంతవాళ్లే పట్టించుకోని ప్రస్తుత రోజుల్లో మిత్రులంతా కలిసి బ్యాచ్‌మేట్‌ను ఆదుకునేందుకు ముందుకు రావడం సంతోషకరమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ఆపదలో ఉన్నవారికి ధైర్యాన్ని ఇస్తాయన్నారు. శ్రీనివాస్ మిత్రులు ఇంతియాజ్, రాంగోవర్ధన్, గోపాల్, నజీర్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి, మే 20 : కల్వకుర్తి ఏడీఈ పరిధిలోని ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అం తరాయం ఉంటుందని కల్వకుర్తి ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రీనివాసులు తెలిపారు. కల్వకుర్తి ఓల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని రెండు ఫీడర్లలో విద్యుత్ సరఫరా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిలిచిపోతుంద న్నారు. రాచూర్, తర్నికల్, పోల్కంపల్లి, బొల్లంపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

విద్యుత్ లైన్లను మరమ్మతులు చేయడం జరుగుతుందని, దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనుందన్నారు. కల్వకుర్తిలో బస్టాండ్, శివాజీచౌక్, ప్రభుత్వ ఆసుపత్రి, మహబూబ్‌నగర్ చౌరస్తా, మార్చాల రూట్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రీనివాసులు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో యువకుడి ప్రతిభ

» పరుగు పందెంలో బంగారు పతకం

ఊట్కూర్, మే 20 : ఫిట్ ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ క్రీడా పోటీల్లో మండలంలోని నిడుగుర్తి గ్రామా నికి చెందిన క్రీడాకారుడు గణేష్ బంగారు పతకం సాధించడం సాధిం చారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ గణేష్‌కు అభినంద నలు తెలిపారు. మారుమూల గ్రామానికి చెందిన యువకుడు బంగా రు పతకం సాధించడం ఉమ్మడి జిల్లాకే గర్వకారణమని అన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసమే 'ప్రీమాన్‌సూన్'

- ట్రీకటింగ్‌లో విద్యుత్ సిబ్బంది
- తాత్కాలిక విద్యుత్ కోతలతో ప్రజలకు తిప్పలు
- లూజ్‌లైన్, పోల్స్ సరిచేయడంతోనే సరి..
- అనధికార విద్యుత్ కోతలపై ప్రజల ఆగ్రహం
- చిన్నగాలికే విద్యుత్ కట్

పాలమూరు, మే 20 : 'ప్రీమాన్‌సూన్' పనులు చేపట్టి ఏడాదిపాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందజేసేందుకు విద్యుత్‌శాఖ నిరంతరం కృషి చేస్తోంది. ప్రధానంగా 33కేవీ, 11కేవీ, ఎల్‌టీ, డీటీఆర్‌లతో పాటు ఏడాదిలో ఒకటి, రెండుసార్లు(వానాకాలం రాకముందు) విద్యుత్ లైన్స్ ఉన్న అన్ని ప్రాంతాల్లో వైర్లపై వేలాడిన కొమ్మలను తొలగించటం, లూజ్‌లైన్, ఇన్సులేటర్, పోల్స్ బెండింగ్ ఉన్నవాటిని క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించి వాటిని సరిచేయాలి. ఫలానా పరికరం ఈ విధంగా ఉంటే విద్యుత్ సరఫరా చేయటం కష్టమని అధికారులు భావిస్తే తక్షణమే దానిని మార్చేస్తారు. 'ప్రీమాన్‌సూన్'తో ఈదురుగాలులు వచ్చినప్పుడు వైర్లపై చెట్లకొమ్మలు పడవు. గాలికి తగలవు. వర్షం, ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఉపయోగపడుతోంది. కేవలం ఒక్క డివిజన్ పరిధిలో ట్రీకటింగ్ చేసి ఎలాంటి సమస్యలు ఉన్నాయో గుర్తించేందుకు రూ.ఐదు లక్షల నిధులు విద్యుత్ సంస్థ కేటాయిస్తోంది. విద్యుత్ సంస్థకు కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎండీగా ముషారఫ్‌అలీ బాధ్యతలు చేపట్టిన తరువాత ఒక్కసారీ జిల్లాకు రాలేదు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి పాలమూరు పట్టణంలో ట్రీకటింగ్ కోసం రూ.మూడు లక్షల నిధులు కేటాయించారు. ఎన్నికల కోడ్ ఉండటంతో అత్యవసర పనులు చేయడానికి మాత్రమే అనుమతి ఉంది. జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల డివిజన్‌లుగా విస్తరించింది.

ప్రతీరోజు అధికారికంగానే ఆరుగంటల విద్యుత్ కోత ఎందుకు..?

ప్రభుత్వం, అధికారులు చెప్పినట్లు అన్ని సమకూర్చటం నిజమైతే అప్రకటిత కోతలు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిన్నపాటి గాలికే గంటల తరబడి కరెంట్‌ను ఎందుకు తీయాల్సి వచ్చిందో విద్యుత్ అధికారులు సమాధానం చెప్పాలంటున్నారు. మే 15వ తేదీ నుంచి ప్రతీరోజు ఏదో ఒక మరమ్మతుల పేరుతో అధికారికంగానే ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తాత్కాలికంగా విద్యుత్ కోత విధిస్తున్నారు. వేసవికాలంలో ఇలా అనేకమార్లు జరిగింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ పోతే కరెంటు కార్యాలయానికి ఫోన్ చేస్తే ఫోన్ పనిచేయదు. ఏమైనా విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే ముందస్తుగా సమాచారమిస్తే దానికి ప్రిపేర్ అవుతామని ప్రజలు చెబుతున్నారు.


మహబూబ్‌నగర్ పట్టణంలో టౌన్-1పరిధిలో ట్రీకటింగ్ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

రాత్రిపూట కరెంట్ తీయడమేంటి..

ఎండాకాలంతో పగలు, రాత్రిపూట ఉక్కపోత. చిన్నపిల్లలతో ఉన్నప్పుడు కరెంటు తీస్తే ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నాం. పాలమూరు పట్టణంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే పల్లెటూళ్లో మాటేమిటి. కరెంటు పోయింది, మళ్లీ ఎప్పుడొస్తుందోనని తెలుసుకుందామని కరెంట్ ఆఫీసుకు ఫోన్ చేస్తే ఫోన్ పనిచేయటం లేదని సమాధానం వస్తోంది. ఒక్కరోజు ముందు చెప్పి అధికారికంగా కరెంటు తీయండి.
- లలిత, గృహిణి పాలమూరు



60శాతం పూర్తి చేసినం..

మహబూబ్‌నగర్ డివిజన్‌లో ఏప్రిల్, మే నెలల్లో అధికశాతం 'ప్రీమాన్‌సూన్' పనులు పూర్తి చేసినం. ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటున్నది వాస్తవమే. నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు జూనియర్ లైన్‌మెన్ నుంచి ఎస్ఈ వరకు అందరం స్పాట్‌లో ఉండి ప్రత్యక్షంగా ఫీల్డ్‌లో ఉంటున్నం.
- సి.వెంకటశివరాం, డీఈ, మహబూబ్‌నగర్



సంప్రదాయం ప్రకారం పండుగలు జరుకోవాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- మద్దిగట్లలో ఘనంగా బీరప్ప బోనాలు



మద్దిగట్లలో బీరప్ప బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, మే 20 : గ్రామాల్లో గ్రామ దేవతలకు సాంప్రదాయ పద్ధతుల ప్రకారం పండుగలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మద్దిగట్ల గ్రామంలో బీరప్ప బోనాల పండుగ ఉత్సవాలకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే డప్పు వాయించారు. గ్రామ దేవతల అనుగ్రహం ఉంటేనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని అన్నారు. మన పెద్దలు అన్ని అనుభవాలతో గ్రామ దేవతల పూజా కార్యక్రమాలను క్రమం తప్పకుండా జరుపుకునే విధంగా కొన్ని పద్ధతులను నేర్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కే.శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రియాంకారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శివ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన



పెద్దదర్పల్లిలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

హన్వాడ, మే 20 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని పెద్దదర్పల్లి, పుల్పోనిపల్లి పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడువులోపు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఇప్పటికే గుర్తించామని, దానికనుగుణంగా నిధులు కేటాయించామని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికల్లా అన్ని పనులు పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో పాఠశాలల మరమ్మతు పనులు జరుగుతున్నాయని, స్థానికంగా ఉండే సిబ్బంది అంతా పనులు పూర్తిచేసేలా సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో యశోదమ్మ, ఈఓఆర్డీ వెంకట్‌రెడ్డి, ఎంఈవో రాజునాయక్, ఏఈ సురేశ్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాన్యులకు పోలీసులు అండగా ఉండాలి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్, మే 20 : సామాన్య ప్రజలు పోలీసులపై ఎంతో నమ్మకంతో స్టేషన్‌కు వస్తుంటారని అలాంటివారికి పోలీసులు అండగా నిలబడి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదులను పురస్కరించుకుని ఎస్పీ తన కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తొమ్మిదిమంది ఫిర్యాదులు అందించి, తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. దీనిపై ఎస్పీ వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. బాధితులను పదేపదే స్టేషన్‌ల చుట్టూ తిప్పుకోవద్దని వారి సమస్యలను విని ఓదార్పునివ్వాలన్నారు. పోలీసులంటే ప్రజలకు నమ్మకం కలిగేలా మన పనితీరు ఉండాలని పేర్కొన్నారు. బాధితులతో మాట్లాడుతూ పోలీసులు మీకు అండగా ఉంటారని, స్టేషన్‌లలో పరిష్కారం అయ్యే సమస్యలు అక్కడే పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మే 20 : బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశానికి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గిరిజన బాల, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం.ఛత్రు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతం వారికి రూ.రెండు లక్షలకు మించి ఉండకూడదని పేర్కొన్నారు. ఆసక్తి గల బాల, బాలికలు మీ సేవాచే జారీ చేయబడిన కుల ధ్రువీకరణ పత్రం, పుట్టిన తేదీ, స్వస్థలం, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు, పాఠశాల బోనఫైడ్, ఆధార్, తెల్ల రేషన్‌కార్డులపై గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించి పూర్తి చేసిన దరఖాస్తు ఫారానికి జతచేసి వచ్చేనెల జూన్ ఆరవ తేదీలోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన వివరించారు. దరఖాస్తు ఫారాన్ని కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చని తెలిపారు. విద్యార్థులకు సంబంధించి ఏ ఒక్క సర్టిఫికెట్ లేకున్నా దరఖాస్తును తిరస్కరిస్తామన్నారు. విద్యార్థుల ఎంపిక లక్కీడిప్ ద్వారా జూన్ 12న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఆరోజు విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు కూడా హాజరుకావాలని ఆయన సూచించారు.

మిడ్జిల్‌లో ప్రజలకు వైద్య పరీక్షలు

మిడ్జిల్, మే 20 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం ఇంటింటికి తిరిగిన వైద్య సిబ్బంది జ్వరంతో పాటు, నొప్పులతో బాధపడుతున్న వారిని గుర్తించి పరీక్షించారు. 13 మంది నుంచి రక్త సేకరణ చేసి వాటిని పరీక్ష నిమిత్తం జిల్లా కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. నొప్పులతో బాధపడుతున్న 25మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి మందులను అందజేశారు. జ్వరం ఉన్నవారు భయాందోళనలకు గురికావొద్దన్నారు. వెటర్నరీ ఆసుపత్రిలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి రోగులను పరీక్షించారు. శిబిరంలో డాక్టర్ శివకాంత్, సీహెచ్‌వో రాము, ఫార్మాసిస్టు శివకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ మహేందర్, హెల్త్ అసిస్టెంట్లు దేవయ్య, జంగయ్య, సంపత్‌కుమార్, గీత, ఆశ వర్కర్లు చిన్నమ్మ, విజయలక్ష్మీ, సుజాత, శారద, అంజమ్మ తదితరులున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చిన్నచింతకుంట, మే 20 : మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం 1995-96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురువులు వెంకటన్న, రాఘవరెడ్డి, నజీర్‌అహ్మద్, బత్తుల బాలరాజు, భాస్కర్, వీరేశం, సిద్ధేశ్వర్ తదితరులున్నారు.

ఎండీసీఏ అభివృద్ధికి కృషి

- క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రంజీకి ఎదగాలి
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఎండీసీఏ ప్రతినిధులు, కోచ్‌లతో ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 20 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్‌ను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికొంత భూమిని కొనుగోలు చేస్తే స్టేడియం అభివృద్ధి చేసేందుకు బీసీసీఐ ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. స్టేడియం అభివృద్ధిలో ఎండీసీఏ కృషి ఎంతో ఉందని, గతంలో ఎన్నడు లేని విధంగా హెచ్‌సీఏ మహబూబ్‌నగర్‌లో ఆరు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదని, ఇటీవలే జిల్లా క్రీడాకారుడు రంజీకి ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ చాలామంది పిల్లలు క్రికెట్ అంటే ఇష్టపడుతారని, జిల్లా క్రీడాకారులు క్రికెట్‌లో రాణించాలన్నారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధుల కృషి, హెచ్‌సీఏ సహకారంతో ఉమ్మడి జిల్లాలో వేసవి శిబిరాలు పెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రికెట్ సంఘం జిల్లా సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్, జడ్చర్ల, కోస్గి, గద్వాల, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లలో నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో వేసవి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జట్లుగా ఎంపిక చేసి మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందులోనూ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం జిల్లా ప్రతినిధులు సురేష్‌కుమార్, అశోక్, రాజేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, మన్నాన్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, పాపరాయుడు, కౌన్సిలర్లు మోతీలాల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారిణి జ్యోతిరెడ్డికి అభినందన



హాకీ క్రీడాకారిణి జ్యోతిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

భారత హాకీ జట్టులో తొలిసారి తెలంగాణ మహిళా జట్టుకు రాష్ట్ర క్రీడాకారిణి జ్యోతిరెడ్డి ఎంపికైంది. ఆదివారం రాత్రి ఉప్పల్ స్టేడియంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆమెను అభినందించారు. హాకీ టోర్నీలో రాణించి భారత జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, చాముండేశ్వరినాథ్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, సినీ దర్శకుడు వంశీ ఉన్నారు.

సహకార సంఘాన్ని బలోపేతం చేస్తాం : ఎమ్మెల్యే

పాలమూరు, మే 20 : సహకార సంస్థల బలోపేతానికి కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని యాదవ కమ్యూనిటీ భవనంలో జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ గతంలో మాదిరి కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా కురుమ, యాదవులకు మేలు చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో గొర్రెల కోసం కట్టిన డీడీలు ఇప్పించినట్లు తెలిపారు. ఇప్పటికీ ఎవరికైనా డీడీలు కట్టిన వారికి డబ్బు రాకపోతే చెబితే ఇప్పిస్తానన్నారు. పూర్వం నుంచి కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కురుమ, యాదవులకు, వారి పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకునే యాదవ, కురుమ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అన్నివర్గాలను అభివృద్ధి చేసేందుకు తీసుకువచ్చే పథకాలతో మేలు జరుగుతుందన్నారు. అంతకుముందు గోపాల్‌యాదవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు శాంతన్న, బాలమణి, కృష్ణయ్య, డా.అబ్దుల్‌రషీద్, వెంకటేష్‌యాదవ్, ఎల్లన్న, లక్ష్మణ్‌యాదవ్, గోవర్ధన్, సాయిలు, నరసింహులు, శ్యాంసుందర్‌లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

- కలెక్టర్ జి.రవినాయక్
- జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం
- వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), మే 20 : మహబూబ్‌నగర్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశమందిరంలో కలెక్టర్ జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించి, వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులపై సమీక్షించారు. వరి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ, చెల్లింపులు, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థినీ, విద్యార్థులకు ఒక జత యూనిఫాం సరఫరాకు కుట్టించడం, పార్లమెంట్, శాసనమండలి ఉప ఎన్నిక కౌంటింగ్‌కు ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, బయోమెట్రిక్ హాజరు అంశాలపై సమీక్షించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు, చెల్లింపులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని అన్నారు. అదేవిధంగా, ట్యాబ్ ఎంట్రీ చేసి మిల్లు నుంచి ట్రక్ షీట్ జనరేట్ చేసి రైతులకు చెల్లింపులు చేయాలని, పౌర సరఫరా శాఖ అధికారులు ట్రక్ షీట్ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, పౌర సరఫరాల శాఖ, సహకార శాఖ, ఐకేపీ అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోళ్లు సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు జిల్లాలో 490 పాఠశాలల్లో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అంచనా వ్యయంలో 25 శాతం నిధులు కూడా విడుదల చేసినట్లు, పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు పనుల పూర్తిపై సమీక్షించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభానికి ముందే స్కూల్ యూనిఫాంలు ఒక జత సరఫరా చేసేందుకు చేపట్టిన పనులపై సమీక్షించారు. ఇప్పటికే జిల్లాకు అవసరమైన క్లాత్ వచ్చినందున కటింగ్‌కు, కుట్టించుటకు మహిళా సంఘాల ద్వారా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో, పట్టణాల్లో వర్షాకాలానికి ముందుగానే చేపట్టాల్సిన పనులపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఫాగింగ్, ఆంటీలార్వా ఆపరేషన్లు, క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల ద్వారా బయోమెట్రిక్ హాజరు శాతంపై సమీక్షించారు. సకాలంలో హాజరుకాని సిబ్బందిపై మెమో జారీ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఉప ఎన్నిక, పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసి కౌంటింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్‌లను నియామకం చేసి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులు ఈనెలాఖరులోగా పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రజావాణి, కార్యాలయ ఫైళ్లను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

నేడు పట్టణంలో విద్యుత్ కోత

పాలమూరు, మే 20 : మహబూబ్‌నగర్ పట్టణంలో మంగళవారం విద్యుత్ కోత విధించనున్నట్లు సెక్షన్-2 ఏఈ వి.ఆదిత్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు ఉండడంతో పట్టణంలోని స్టేడియం గ్రౌండ్, క్రౌన్ గార్డెన్, రవి పిల్లల ఆసుపత్రి, వాసవి కళాశాల, రామాలయం, వాగ్దేవి కళాశాల ఏరియాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వివరించారు. విద్యుత్ సిబ్బందికి పట్టణ ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

కొత్తమొల్గర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో...

భూత్పూర్ : మండలంలోని కొత్తమొల్గర గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ మిత్యానాల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు

కోయిలకొండ, మే 20 : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో మంగళవారం నుంచి స్వామివారి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు వై.రఘురామాచారి తెలిపారు. మంగళవారం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామికి మన్యసూక్త ఫల పంచామృత అభిషేకం, సాయంత్రం ప్రదోషపూజ, బుధవారం సుదర్శన హోమం, గురువారం కల్యాణం, పల్లకీసేవ, రథోత్సవం నిర్వహిస్తామని వివరించారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

తాటికొండలో కల్యాణం

భూత్పూర్ : మండలంలోని తాటికొండ గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు గ్రామానికి చెందిన వెంకటస్వామి అనే భక్తుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవంతో పాటు, హోమం, తిరుమంజసేవ, తదితర కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థానం శైవాగమ పండితుల సమక్షంలో నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వెంకటస్వామి కోరారు.

విత్తనాలు కొనేటప్పుడు రశీదు తీసుకోవాలి

- దేవరకద్ర ఏడీఏ యశ్వంతరావు



భూత్పూర్‌లోని ఓ విత్తన దుకాణంలో స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ యశ్వంత్‌రావు

భూత్పూర్, మే 20 : ఖరీఫ్ సీజన్ మొదలు కావస్తోందని, రైతులు విత్తనాలు కొనేముందు జాగ్రత్తగా పరిశీలించి, నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని దేవరకద్ర ఏడీఏ యశ్వంతరావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు కొనేందుకు వచ్చిన రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విత్తనాలు కొనేముందు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, అదేవిధంగా విత్తన ప్యాకెట్లపై ఉన్న వివరాలను, మ్యానుఫాక్చర్, ఎక్స్పైరీ తేదీలను తప్పనిసరి చూడాలని సూచించారు. గుర్తు తెలియని వారు విత్తనాలు అమ్మినట్లు తెలిసితే మండల వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఏడీఏ వెంట స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు

దేవరకద్ర, మే 20 : స్థానిక మార్కెట్‌యార్డులో సోమవారం ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు తాము పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చారు. వేలం ధరలో పెద్ద సోన ఆర్ఎన్ఆర్ గరిష్ఠంగా రూ.2,383, కనిష్ఠంగా రూ.రెండు వేలు, ఆముదాలు గరిష్ఠంగా రూ.5,450, కనిష్ఠంగా రూ.2,440, పెద్ద సోనా 154 క్వింటాళ్లు, ఆముదాలు 39 క్వింటాళ్లు అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

రాజాపూర్, మే 20 : అనారోగ్యంతో మరణించిన మండల కేంద్రానికి చెందిన చాకలి కృష్ణయ్య, పరిధిలోని నర్సింగ్ తండాకు చెందిన రాంచందర్‌నాయక్ కుటుంబాలకు దొండ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యురెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుల అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.ఐదు వేల చొప్పున సాయాన్ని యువసేన సభ్యులు, నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం నగదును అందజేశారు.

● దేవరకద్ర : అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతిచెందిన మండలంలోని కోయిల్‌సాగర్ గ్రామవాసి హరిజన్ ఈశ్వరయ్య కుటుంబానికి జేకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొన్న రాజశేఖర్ రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తానని కుటుంబీకులకు తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించరూ..

- మారుమూల గ్రామాలకు బస్సులు రాక ప్రయాణికుల ఇక్కట్లు
- కాలినడకను ఆశ్రయిస్తున్న విద్యార్థులు, మహిళలు
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం



బస్సు సౌకర్యం లేక ఆటోలో ప్రయాణం చేస్తున్న మహిళలు

గండీడ్, మే 20 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో మహిళలు సంతోషించారు. కానీ మండల పరిధిలోని చెలిమిల్ల, జిన్నారం, లింగాయిపల్లి, జక్లపల్లి, రంగారెడ్డిపల్లి, మన్సూర్‌పల్లి, పంచాంగాల తండా, బల్సూర్‌గొండ, పగిడ్యాల్, రుసుంపల్లి, చిన్నవార్వల్, పెద్దవార్వల్, సాలర్‌నగర్ లాంటి మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు నానా ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో కూడా ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ప్రస్తుతం వేసవిలో విద్యార్థులు కోచింగ్‌లు, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ లాంటి కోర్సులకు కోస్గి, మహబూబ్‌నగర్‌కు రాకపోకలు కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలతో పాటు, ద్విచక్ర వాహనాలు ఉన్నవారు వారిని గమ్యానికి చేరవేయాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతోందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. మరోవైపు సాయంత్రం ఏడు దాటిందంటే పైన ఉన్న మారుమూల గ్రామాలకు ఆటోలు నిలిచిపోతాయి. దీంతో కాలినడకన విద్యార్థులతో పాటు, ఆయా గ్రామాల మహిళలు దాదాపు ఐదు కిలోమీటర్లు నడిచి ఇళ్లకు చేరుకుంటున్నారు. పరిగి నుంచి చాలా గ్రామాలకు రాకపోకలు ఉంటాయి. పరిగితో పాటు, మహబూబ్‌నగర్ డిపోల నుంచి మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో పరిగి డిపో నుంచి కొత్లాబాద్ వరకు బస్సును నడిచేదని, ప్రస్తుతం బస్సు రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. ఈ విషయమై సర్వసభ్య సమావేశంలో కూడా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. కాగా, ఎన్నికల అనంతరం మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు డీఎంతో మాట్లాడతానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

ఆటోలను ఆశ్రయిస్తున్నాం..



కొన్ని సంవత్సరాల నుంచి మండల కేంద్రానికి వెళ్లాలన్నా, అత్యవసరమై ఆసుపత్రికి పోవాలన్నా ఆటోలను అద్దెకు తీసుకొని వెళ్తున్నాం. ప్రతీరోజు మూడు సమయాల్లో బస్సు సౌకర్యం కల్పిస్తే సౌకర్యంగా ఉంటుంది. రాత్రి వేళ పరిగి నుంచి జిన్నారం వెళ్లాలంటే నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే పరిగి నుంచి బస్సు సౌకర్యం కల్పించాలి.

\- జైపాల్‌రెడ్డి, జిన్నారం

గ్రామాలకు బస్సులను నడిపించాలి..



మండలంలోని మారుమూల గ్రామాలకు పరిగి, మహబూబ్‌నగర్ డిపోల నుంచి బస్సులను నడిపించాలి. గతంలో పరిగి డిపోకు చెందిన బస్సు పరిగి నుంచి కొత్లాబాద్ వరకు వెళ్లేది. చాలామంది హైదరాబాద్ వెళ్లి రాత్రి వరకు ఇంటికి వచ్చేవారు. ఇప్పుడు పరిగి నుంచి రావాలంటే నంచర్ల గేటునుంచి చుట్టూ తిరిగి వచ్చేవరకు తాండూర్ వెళ్లే బస్సులు మిస్ కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

\- కేస్లీబాయి, బల్సూర్‌గొండ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు

పరిగి నుంచి బస్సును నడిపించాలి..



గండీడ్ మండల ప్రజలు ఎక్కువగా పరిగి వెళ్లి వస్తుంటారు. కొన్ని సంవత్సరాలుగా పరిగి నుంచి బస్సు వచ్చేది. కానీ జిల్లాల మార్పిడితో పరిగి నుంచి పగిడ్యాల్, కొత్లాబాద్ వరకు వెళ్లేవారికి ఇబ్బందిగా మారింది. వెంటనే పరిగి నుంచి ఒక్క బస్సు మహబూబ్‌నగర్ నుంచి మరో బస్సును నడిపించి, తమ ఇబ్బందులను తొలగించాలి.

\- అశోక్‌గౌడ్, బల్సూర్‌గొండ